క్లుప్తంగా

డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సాహం కల్పించాలి



రమణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని అన్ని పంటలకు డ్రిప్ ఇరిగేషన్ దిశగా రైతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి రమణకు మంగళవారం ఖమ్మంలోని కార్యాలయంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు తల్లపురెడ్డి నాగిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన రమణకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మీనవోలు సొసైటీ చైర్మన్ కుడుముల మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ జానీబాషా పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ 'సఖీ'కి అప్పగింత



మహిళను సిబ్బందికి అప్పగిస్తున్న స్థానికులు

తల్లాడ: మతిస్థిమితం లేని మహిళను హైదరాబాద్ సఖి కేంద్రానికి అప్పగించారు. మండలకేంద్రంలో మతిస్థిమితం లేకుండా ఓ మహిళ తిరుగుతుండగా స్థానికులు ఆమెకు దుస్తులు, భోజనం అందించి హైదరాబాద్ సఖి కేంద్రానికి సమాచారం అందించి మంగళవారం సఖి సిబ్బంది పుష్పలతకు అప్పగించారు. కటికి వెంకయ్య నాయుడు, మా రత్తమ్మ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, మణి మహాలక్ష్మి, ముదిగొండ్ల రామునాయుడు, వెంకటలక్ష్మి, కె.రజిని, సునీత, ఎనుములు రుక్మిణీ, కావేటి రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

గోవింద పట్టాభిషేకం

తల్లాడ: స్థానిక హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శ్రీ వేంకటేశ్వర స్వామికి గోవింద పట్టాభిషేకం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అర్చకులు దివి సీతారామాచార్యులు, పరాంకుశం అమ్మ తాచార్యులు, రొంపిచెర్ల వెంకట సత్యనారాయణచార్యులు, పరాంకుశం విఖనసాచార్యులు, పరాంకుశం బాలక్రిష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పట్టాభిషేకం, కల్యాణం నిర్వహించారు.

ఎంపీని కలిసిన నాయకులు

చింతకాని: ఎంపీగా రాజ్యసభకు ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను మండల పరిధిలోని సీతంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పోలూరి కిరణ్, నారపోగు నాగయ్య ఉన్నారు.

క్రీడా పోటీలు

ముదిగొండ: మండలపరిధిలోని కమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నెహ్రూ యువకేంద్రం, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో క్రీడాపోటీలు మంగళవారం నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్, క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం..



సత్తుపల్లిటౌన్: భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్, ఎంపీపీ హైమావతి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అయ్యగారిపేట శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమానికి రూ.10వేలు విరాళంతో వల్లభనేని లక్ష్మి కుమారులు వల్లభనేని పవన్, ప్రవీణ్‌లు చేయూతనిచ్చారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దొడ్డా శంకర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

మధిరరూరల్: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల సేవాసదనంలో యూఎస్ఏలో నివసిస్తున్న పాలపర్తి ప్రవీణ పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు అన్నదానం చేశారు. నిర్వాహకురాలు స్వర్ణలత, పాల్గొన్నారు.

ఆరుగురి బైండోవర్

కల్లూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆరుగురిని నాటుసారా కాస్తున్నారని మంగళవారం తహసీల్దార్ పులి సాంబశివుడు ఎదుట హాజరుపరిచి బైండోవర్ కేసు నమోదు చేశారు. ఎక్సైజ్‌శాఖ ఎస్సై కృష్ణ ఆధ్వర్యంలో సిబ్బందితో దాడి చేయగా లక్ష్మీపురం పంచాయతీ కొత్తబోడిమెల్ల గ్రామానికి చెందిన బానోత్ సీతారాములు, అజ్మీరా రుక్మిణి, హనుమాతండా గ్రామానికి చెందిన గుగులోత్ జానకి, పెద్దకోరుకొండికి చెందిన బూరుగు ఝాన్సీ, ఎర్రబంజరకు చెందిన గుగులోత్ జయరామ్‌లపై కేసు నమోదు చేశారు.

పేరుకే 30 పడకలు..

బనిగండ్లపాడు పీహెచ్‌సీలో అందని వైద్యం

- భర్తీకి నోచుకోని వైద్యుల పోస్టులు
- ఐదుగురు డాక్టర్లకు ఒక్కరినీ నియమించని వైనం



బనిగండ్లపాడు ప్రభుత్వాస్పత్రి భవనం

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీని పేరుకు మాత్రమే 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కానీ ఆ తర్వాత వైద్యుల నియామకం, ఇతర అంశాల్లో పట్టించుకోకపోవడంతో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. వైద్యుల పోస్టులన్నీ ఖాళీగానే ఉండడంతో డెంటల్, ఆయుర్వేద వైద్య సేవలు మాత్రమే అందుతున్నాయి. ఫలితంగా ఏ ఆపద వచ్చినా ప్రజలు మళ్లీ ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించక తప్పడం లేదు.

ఏడాది కాలంగా డాక్టర్ల కొరత..

బనిగండ్లపాడు పీహెచ్‌సీలో ఏడాదిగా డాక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ ఆస్పత్రిలో ఉన్న ఐదు డాక్టర్ పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. దీంతో ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మారింది. కేవలం డెంటల్, ఆయుర్వేద వైద్య సేవలు మాత్రమే అందుతున్నాయి. ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం ఓపీ వేళల్లో దాదాపు వంద మంది రోగులకు పైగానే వస్తున్నారు. మధ్యాహ్నం వరకే అందుబాటులో ఉండే డెంటల్, ఆయుర్వేద డాక్టర్లు ఓపీ చూస్తున్నారు. ఆ తర్వాత వచ్చిన రోగులకు స్టాఫ్ నర్సులే వైద్యం చేసి పంపిస్తున్నారు. అప్పుడప్పుడు పల్లె దవాఖానాలోని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) లు ఆస్పత్రికి వచ్చి రోగులను పరీక్షిస్తున్నారు. కాగా, గత శనివారం నుండి మధిర మండలం మడుపల్లిలోని బస్తీ దవాఖానా డాక్టర్ సాతిక్‌రెడ్డిని ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్‌గా నియమించారు. కానీ పూర్తిస్థాయిలో వైద్యులను నియమిస్తే తప్పా సమస్య తీరే అవకాశం కనిపించడం లేదు.

పరీక్షలకూ ఇక్కట్లే..

ఈ ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ లేదు. ఇక్కడ రక్త పరీక్షలతో పాటు, ఇతరత్రా వైద్య పరీక్షలు చేయాలంటే ఖమ్మంలోని పెద్దాస్పత్రికి రక్తం శ్యాంపిల్స్ తీసి పంపిస్తున్నారు. ఇక్కడ పని చేసే వైద్య సిబ్బంది కూడా ఖమ్మం, మధిర తదితర పట్టణాల నుండే వచ్చి వెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని మీనవోలు, బనిగండ్లపాడు గ్రామాల్లోని సబ్‌సెంటర్లలో హెల్త్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. దీంతో వాక్సినేషన్ ప్రక్రియ నిర్వహణకు ఇన్‌చార్జిలే దిక్కుగా మారారు. సిబ్బంది భర్తీ కాకపోవడంతో అరకొరగానే సేవలందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పరీక్షలు చేస్తున్న ఇన్‌చార్జ్ డాక్టర్ సాకేత్‌రెడ్డి

డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలి



పీహెసీసీలో డాక్టర్ల పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. ఇప్పటికే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కలెక్టర్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లా. డాక్టర్లు లేకపోవడంతో రోగులకు మెరుగైన సేవలందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి.

– జంగా పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్, బనిగండ్లపాడు

డిప్యూటేషన్‌పై విధులు..



మడుపల్లి బస్తీ దవాఖానాలో డాక్టర్‌గా పనిచేస్తున్నా. శనివారం నుండి బనిగండ్లపాడు పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై కేటాయించారు. ఆస్పత్రిలో ప్రస్తుతం డెంటల్, ఆయుర్వేద వైద్యులు ఉండగా.. ప్రజలకు వైద్యం అందిస్తున్నాం. డాక్టర్ పోస్టుల భర్తీ అంశం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.

– ఏ.సాకేత్‌రెడ్డి, వైద్యులు, బనిగండ్లపాడు

ఐక్యతను చాటేందుకే 'రన్ ఫర్ జీసెస్'



సుదర్శనాన్ని సన్మానిస్తున్న కరుణాకర్, తదితరులు

సత్తుపల్లి: క్రైస్తవుల ఐక్యతను చాటేందుకు ఈ నెల 30న సత్తుపల్లిలో నిర్వహించే రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ జాతీయ పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు అలవాల కరుణాకర్, టీసీసీ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ ఎండి సుదర్శనం పిలుపునిచ్చారు. సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనామందిరంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో సేవకులందరు 30న ఉదయం 7 గంటలకు సత్తుపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలని కోరారు. అనంతరం బిషప్ సుదర్శనంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు జాన్‌మార్క్, జి.సత్యానందం, పింగళి సామేలు, పిల్లి రవికిరణ్‌పాల్, పాల్‌రాజు, వరప్రసాద్, ఐ.శ్రీనివాసరావు, కె.దేవసహాయం, ఐ.దానియేలు తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభకు తరలిన నాయకులు

ఎర్రుపాలెం: కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా హాజరైన విజయ సంకల్ప యాత్ర సభకు మంగళవారం మండలంలోని గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రాష్ట్ర కిసాన్ ఖేత్ కమిటీ సభ్యులు నూతక్కి నర్సింహారావు జెండాను ఊపి ప్రారంభించారు. మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, దేవరకొండ కోటేశ్వరరావు, చంద్ర మౌళేశ్వరరావు, ఈశ్వరయ్య, తదితరులున్నారు.

దుప్పట్లు పంపిణీ

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరు ఎస్సీ కాలనీకి చెందిన 30 మంది వృద్ధులకు మంగళవారం సత్తుపల్లికి చెందిన సుధా హెర్బాల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ... వృధాప్యం అంటే వయసు మళ్లడం కాదని అది నిలువెత్తు అనుభవమన్నారు.

'మహిళా శక్తి'కి తరలిన మహిళలు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కల నేతృత్వంలో మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన మహిళా శక్తి సదస్సుకు వైరా నుండి డ్వాక్రా మహిళలు తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ జెండా ఊపి బస్సును పంపించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కమిషనర్ చింతల వేణు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తి కళాశాలలో సదస్సు



సదస్సులో పాల్గొన్న వక్తలతో కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో సోమ, మంగళవారం 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తలుగా ఆడమా–ఇథియోపియా ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరువీధుల గోపీకృష్ణ, ఆడమా సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ డీన్ అండ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టెక్లు ఉర్గెస్సా పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ సైన్స్ విభాగాల్లో ప్రముఖుల ఆలోచనలను పంచుకోవడానికి ఈ సదస్సు నిర్వహించినట్లు కళాశాల బాధ్యులు తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి సదస్సును ప్రారంభించగా, ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఆలయ నూతన కమిటీ

వేంసూరు: మండల పరిధిలోని రాయుడుపాలెం శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సోమవారం రాత్రి ప్రమాణం చేసింది. ఈ మేరకు జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్ సమత ఆధ్వర్యంలో చైర్మన్‌గా ఈడా కృష్ణ, కమిటీ సభ్యులుగా మాకినేని రాంబాబు, నందిగామ హరికిషన్, మద్దాల నాగేంద్ర, కాకాని శ్రీనివాసరావు, అదేవిధంగా బెండలపాటి వీరన్న దేవస్థానం చైర్మన్‌గా మద్దాల వెంకటేశ్వరరావు, సభ్యులుగా గజవెల్లి వెంకటేశ్వరరావు, మేకల చిట్టిబాబు, పరిటాల కేశవులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులను సన్మానించారు.

సమస్యలు పరిష్కరించాలి

పెనుబల్లి : హాస్టల్ విద్యార్థులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బెజవాడ సాయిశేషు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని టేకులపల్లి మోడల్ కళాశాలను మంగళవారం పరిశీలించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి గృహంలోని స్లాబు పెచ్చులు ఊడిపోతున్నాయని, మెనూ ప్రకారం భోజనం పెట్టమని అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకురాలు బుక్కా కృష్ణవేణి, నవ్య, భవానీ, సాహితి, సుప్రియ, కావ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు..

- విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



కొణిజర్ల: పరీక్షా సామగ్రి అందజేస్తున్న పరిశ సీతారత్నం ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య

కొణిజర్ల: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించడంతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుమ్మలపల్లి ప్రధానోపాధ్యాయురాలు సూర్యదేవర అజిత, జెడ్పీ పెద్దగోపతి హెచ్ఎం కె.మార్క్ అన్నారు. తుమ్మలపల్లిలో పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి బాల బాలికలకు ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య పరీక్షా సామగ్రిని అందజేశారు. పెద్దగోపతి ఉన్నత పాఠశాలలో సీవీరామన్ జూనియర్ కళాశాల ఖమ్మం వారు అందజేసిన పరీక్షా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు వాసిరెడ్డి రాజశేఖర్, మంజుల, రమాదేవి, నిర్మల, వీరకుమారి, బోడపోతుల భద్రయ్య, శశికుమార్, విజయ్, పుల్లారావు, రంజాన్ , సీవీ రామన్ కళాశాల లెక్చరర్‌లు నరసింహారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: విద్యార్థులు కష్టపడి చదువుతూ విద్యాభివృద్ధిని సాధించాలని శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం, చినమండవ, మత్కేపల్లి, నాగులవంచ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి సభ్యులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా సభ్యులు ఆలస్యం నర్సింహారావు, గాంధిరెడ్డి, ఆదినారాయణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: చంద్రు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గేటు కారేపల్లి హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు భూక్యా వీరన్న, భూక్యా మంగిత్యా, హెచ్ఎం ఆదినారాయణ, శంకర్, శ్రీనివాస్, ఆనంద్, సుజాత, రమేష్, వినోద్, రవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లిలో..



చింతకాని: చినమండవ ఉన్నత పాఠశాలలో..

ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి..

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



సత్తుపల్లిరూరల్: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్: ఎన్నికల సందర్భంగా ఏదైతే మాట ఇచ్చామో.. ఇచ్చిన మాట ప్రకారం నియజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని, పేద ప్రజల కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నెరవేరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మండలంలోని చెరుకుపల్లి, యాతాలకుంట, రామానగరం గ్రామాలలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీలన్ని పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఖాజానాను ఖాళీ చేసి రూ.7 లక్షల కోట్లు అప్పులను చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో శివవేణు, చల్లగుళ్ల నర్సింహారావు, వినుకొండ కృష్ణ, కొప్పుల నరేందర్‌రెడ్డి, ఒంటెద్దు సాయిలు, బొమ్మారెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, మదకం ప్రసాద్, బాబురావు, రాంబాబు, సత్యనారాయణ, జయరాజు, వెంకట్, దండు ఆదినారాయణ, భూషణం, రామకృష్ణ, దండు నాగేశ్వరరావు, రాము, వెంకటాచలం పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

వేంసూరు: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆరుగ్యారంటీలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, మండలాధ్యక్షుడు కాసరి చంద్రశేఖర్ రెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, గొర్ల వెంకటప్పరెడ్డి, గడిపర్తి శ్రీనివాసరావు, మందపాటి రాఘవరెడ్డి, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బాల రాంబాబు, ఎంపీ.పక్రుద్దీన్, జంగ జమలయ్య, నాగులు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీడీ శిరీష

చింతకాని: ఉపాధి హామీ పథకం ద్వారా పనుల్లో కూలీల సంఖ్య మరింతగా పెంచాలని డీఆర్‌డీఓ ఏపీడీ శిరీష సూచించారు. చింతకానిలో పనులను మంగళవారం తనిఖీ చేసిన ఆమె మాట్లాడుతూ కూలీలకు కనీస వేతనం వచ్చేందుకు పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీడీ చుంచు శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామయ్య, ఉద్యోగులు కోటయ్య, హుస్సేన్, షేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా ప్రజాపాలన దరఖాస్తులు



ముదిగొండ: మండల పరిషత్ కార్యాలయంలో క్యూలో కూర్చున్న వినియోగదారులు

ముదిగొండ: కొత్త ప్రభుత్వంలో ఆరు పథకాల గ్యారంటీలపై అర్హులైన పేదలు తమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు గందరగోళంగా మారాయి. ఉచిత విద్యుత్, రూ.500గ్యాస్ వినియోగంపై దరఖాస్తుల్లో పొందుపరచలేదని అధికారులు నిలిచిన దరఖాస్తులు రోజుకు వందల్లో తేలుతున్నాయి. వీటికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ నమోదులో తప్పుల తడకగా నమోదు కావడంతో అర్హులు కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తుదారులు మూడు రోజుల నుంచి తిరుగుతున్నారు.

ఈ మేరకు మంగళవారం జెడ్పీ సీఈఓ పర్యటించి మండలపరిషత్ కార్యాలయంలోనే గంటపాటు ఉంటి పర్యవేక్షించారు. సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు. త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు.

జీరో బిల్లుల కోసం పడిగాపులు..



కల్లూరురూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో పడిగాపులు ..

కల్లూరురూరల్: ఉచిత కరెంటు జీరో బిల్లు పథకంకు సంబంధించి కల్లూరు మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 1,500లకుపైగా గృహ వినియోగదారులకు జీరో బిల్లులు రాక డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజాపాలన దరఖాస్తుల్లో అనేక మంది యూఎస్‌సీ నంబర్లు రాయకుండా కేవలం విద్యుత్ సర్వీస్ నెంబర్ రాయడంతో చాలామందికి జీరో బిల్లు రాలేదు. దీంతో జీరో బిల్లు రాని వారు మండల పరిషత్ కార్యాలయం ఎదుట పడిగాపులు పడుతున్నారు. ఇప్పటికైనా జీరో బిల్లుల విషయంపై అవగాహన కల్పించి అర్హులైన లబ్ధిదారులందరికీ జీరో బిల్లులు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలిక సాధికారతపై అవగాహన

కారేపల్లి: బాలికలు ఆర్థిక-అక్షరాస్యత సాధించాలని, బాలిక సాధికారత దిశగా పయనించాలని కారేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ.అక్తర్ అన్నారు. మంగళవారం కారేపల్లి మోడల్ స్కూల్‌లో బాలిక సాధికారత సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కారేపల్లి ఎస్‌బీఐ మేనేజర్ గౌరవ్‌శుక్లా అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ ప్రభాకర్, పాఠశాల బాలిక సాధికారత కన్వీనర్ అర్చన, వైఎస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు రామ్‌ప్రసాద్, సంధ్యారాణి పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం..

రోడ్డుపై పడిన ఎండిన వృక్షం..



రోడ్డుపై విరిగిపడిన చెట్టు

మధిరరూరల్: మధిర నుంచి మీనవోలు వెళ్లే ప్రధాన రహదారిలో దెందుకూరు సమీపంలో ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన కొన్ని చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ మేరకు మంగళవారం రోడ్డు పక్కనే ఉన్న ఎండిపోయిన చెట్టు రోడ్డుపైకి పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ చెట్టు పడిపోవడం వల్ల కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఇదిలా ఉండగా రోడ్డుకిరువైపులా పలుచోట్ల ఎండిపోయిన చెట్లు ఉన్నాయని ప్రమాదం పొంచి ఉందని, ఆ చెట్లను తొలగించాలని సాక్షి ముందే హెచ్చరించింది. ఈ రహదారిలో నిత్యం వందలాది మంది ద్విచక్ర వాహనదారులు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదకరంగా ఉన్న చెట్లు ఎప్పుడు మీద పడతాయో తెలియక ఆ రహదారిపై వచ్చి వెళ్లే వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్ ఎక్కిన టిప్పర్..



డివైడర్ పైకి దూసుకుపోయిన టిప్పర్

వైరా: ముందు వెళ్తున్న కారును తప్పించబోయి టిప్పర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టి డివైడర్ పైకి ఎక్కిన ఘటన వైరాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక సీఎస్ఐ చర్చి సమీపంలో ఖమ్మం వైపు నుండి వస్తున్న భారీ డంపర్ వాహనం ముందు వెళ్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పి డివైడర్‌పైకి ఎక్కింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి

మిర్చి లోడు ట్రాక్టర్ పల్టీ..

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లెందులపాడు గ్రామ సమీపంలో మంగళవారం అదుపు తప్పి మిర్చిలోడు ట్రాక్టర్ బోల్తా కొట్టింది. దెందుకూరు వైపు నుంచి ఆత్కూరు వైపు ఉన్న కోల్డ్ స్టోరేజ్ కి వెళ్లేందుకు ఒక రైతు ట్రాక్టర్‌లో మిర్చి బస్తాలు నింపుకొని వస్తుండగా ప్రమాదవశాత్తు ఇల్లెందులపాడు సమీపంలో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. మిర్చి బస్తాలన్నీ కింద పడిపోయాయి.



పల్టీ కొట్టిన ట్రాక్టర్